# కుక్కబాబు

## తారక రామారావు

"**టు లెట్**" అన్న బోర్డు చూసి రమేష్ ఇది కలా, నిజమా అన్న అనుమానం వచ్చి కళ్ళు నులుముకుని మరీ చూశాడు.

"ఆహా...! ఏమి నా భాగ్యము!" అని ప్రకాశముగా అనుకుని, ఆనంద భైరవి రాగంలో ఈల వేసి, చమట పట్టిన మొహాన్ని జేబురుమాలుతో తుడుచుకున్నాడు.

కుడి కాలు ముందు వేసి, టు లెట్ బోర్డు ఉన్న ఇంటి వేపు వెళ్ళాడు. గేటు తియ్యబోయి, కుక్కలున్నాయి జాగ్రత్త అన్న బోర్డు ఉందేమోనని చూశాడు. లేదు! 'హమ్మయ్య !' అనుకుని, గేటు మీదుగా ప్రహరీ లోపలకు దృష్టి సారించాడు రమేష్.



సుమారు వెయ్యి గజాల స్థలంలో మధ్యగా మేడ. మేడ ముందు చిన్ని కృష్ణుని సిమెంటు బొమ్మ. బొమ్మకు ముందు ఫౌంటెన్. దాని చుట్టూ తామర చెట్లు. ఇంటి ముందంతా చక్కని వచ్చిక. ప్రహరీ గోడ ప్రక్కన రెండే రెండు పోక చెట్లు. వాటి కిరు ప్రక్కలా అశోక వృక్షాలు. ఆహా! నందన వనము ఇదే అనుకున్నాడు, అనుకుని, ఈ నందన వనంలో ఇల్లు అద్దెకు ఉన్నది! బాగుంది. కానీ అద్దె తను భరాయించగలడా అని ప్రశ్న వేసుకుని, సమాధానం దొరక్క బుర్ర గోక్కున్నాడు. గోక్కుని మళ్ళీ క్రాపు ఎడం చేత్తో సవరించుకుని, "చూద్దాం. చూసి, నచ్చితే, అద్దె భరించగలిగితే అప్పుడు చూద్దాం" అనుకున్నాడు.

అన్నట్లు ఇంటి పేరు 'నందన వనం' అని 'పాల రాతి మీద చెక్కబడి ఉంది. అది గమనించి 'కల నిజ మాయెగా' అని పాటందుకోబోయి, మానేసి గేటు తీసుకు లోపలకు అడుగు పెట్టాడు.

రెండోసారి మయసభలో ప్రవేశించిన దుర్యోధనుడిలాగా, అడుగులో అడుగు వేసుకుంటూ పోర్టికో చేరిన రమేష్ ఎందుకో అనుమానమొచ్చి వెనక్కు చూశాడు.

గుండె ఆగినంత పనయింది. బడిలో నుంచి వచ్చిన పిల్లల్లాగా రమేష్ వెనుక డజను కుక్కలు. కొన్ని తెల్లగా మంచు ముద్దల్లా ఉన్న బొచ్చు కుక్కలు. మరి కొన్ని నల్లగా, బారుగా, చెవులు వేలాడేసుకుని, నాలుకలు చాపుకుని ఉన్న కుక్కలు. ఇంకొన్ని ఒళ్ళంతా జానెడు బొచ్చుతో, హిప్పీ క్రాపు పెంచుకున్న అల్లరి పిల్లల్లా ఉన్న కుక్కలు.

అవన్నీ నిశ్శబ్దంగా, రమేష్ వెనుక నిలబడి ఉన్నాయి.

రమేష్‌కు కుక్కలంటే అసహ్యం. లోపల కొంచెం భయం కూడా.

కాళ్ళల్లోంచి చిన్నగా వణుకు ప్రారంభమై, మరుక్షణంలో సిరలు, ధమనుల ద్వారా ఒళ్ళంతా ప్రాకి ఆ పైన చమట పట్టేసింది. 'హరి భగవంతుడా! నేరకపోయి వచ్చాను గదరా తండ్రీ' అని ఆర్తనాదం మనస్సులోనే చేసుకుని, "అయినా, ఈ కొంప కట్టుకున్న ప్రబుద్ధుడికి ఆవగింజంత జ్ఞానం కూడా లేదు. లేకపోతే గేటు మీద "కుక్కలే ఉన్నాయి జాగ్రత్త' అని ముక్క వ్రాసి ఏడవకూడదూ' అని తిట్టుకుని ముందుకు సాగాలా, వెనక్కు వెళ్ళాలా అన్న సందిగ్ధంలో క్షణం నిలుచుని, ధైర్యం చేసి వెనకడుగు వేశాడు.

కుక్కలూ సుశిక్షితమైన సైనికుల్లా ఓ అడుగు వెనక్కు వేశాయి ఉమ్మడిగా.

'హమ్మ వీడెమ్మ కడుపు కాలా! వీటి వాలకం చూస్తే వీలు, వాలు చూసుకుని మీద పడి, అహింసాయుతంగా తనను నాకి చప్పరించేలా ఉన్నాయి అనుకుని డీలా పడిపోయి, వడి వడిగా అడుగు ముందుకు వేశాడు- ఓ కన్ను కుక్కల పైనే కేంద్రీకరించి, కుక్కలు కూడా రమేష్ నడిచినంత వేగంతో నడిచి, అతను ఆగగానే ఆగాయి.

'ఏదీ గతి నాకూ' అన్న కీర్తన పూర్తిగా రాక, వంట్లో హుషారు ఖర్చయి పోయి, ఎక్కడా మాసవ

మాత్రుని అలికిడి వినరాక, కనరాక ఇరవయి అయిదేళ్ళ జీవితమూ ఈ రోజుతో మంగళం మహత్! అని నిర్ధారించుకుని, నీరసం వచ్చి గొంతెత్తి 'రావే ఈశ్వర, కావవే వరద' అని అన బోయి 'హ్రరైజీశ్వరా, కావమ్మా దరద' అన్నాడు. కుక్కలు మొరిగాయి ఆ భాష అర్థం గాక.

అప్పుడు పోర్టికో మెట్ల మీద కారు చీకట్లో కాంతి రేఖలా, ఇనుకలో ముత్యపు చిప్పలా, మహా నగ రంలో సిటీ బస్సులా ఓ అమ్మాయి ప్రత్యక్షమై,

"హాయ్ డార్లింగ్స్! ఏం చేస్తున్నా రిక్కడ... కమాన్" అంది. కుక్కలు ఆ అమ్మాయి దగ్గర కెళ్ళాయి పోలోమంటూ.

రమేష్ చలి జ్వరం తగ్గిన వాడిలా అయి, ఓ మారు మెరుపు తీగను, వెంటనే ఆమెను పరివే ష్టించిన శునక సముదాయాన్ని చూస్తూ వెర్రి వాడిలా ఓ నవ్వు నవ్వాడు- తనంటూ ఓ శాల్తీని ఉన్నానన్న విషయాన్ని ఆమెకు గుర్తు చేస్తూ.

బంగారు శలాక కుక్క పిల్లల కోసం మొహం వాచిపోయిన దాన్లా, 'టామీ' అని, 'హుర్రే మిక్కీ' అని, 'హౌ ఆర్ యు బాబీ' అని ఉన్న కుక్కలన్ని టినీ ముద్దు ముద్దుగా పలకరించి, ఆ పైన కొన్నిటిని ముద్దెట్టుకుని, మరీ చిన్న కుక్కను చంకలో కెత్తుకుని పోబోతూ ఆగి, రమేష్‌ను చూసి విచిత్రంగా నవ్వి, "హెవ్వరు కావాలండీ" అంది.

"ఇల్లండీ... ఇల్లు" అన్నాడు రమేష్, తడారిపో యిన పెదవులను నాలుకతో తడువుకుంటూ.

"ఐ సీ!" అని చంకలో చిన్న దాన్ని తలమీద దువ్వుతూ, "కూరుసోండి!" అని వెడుతూ "యాద్ గిరీ!" అని సుతారంగా కేకేసింది.

రమేష్ 'ఇల్లొద్దు! పాడొద్దూ! బ్రతికి యుండిన సిగరెట్లు త్రాగి బ్రతకవచ్చు' అనుకుని, అలా అని పోలేక, క్రొత్త పెళ్ళి కూతురు తొలి రోజు పడగ్గది లోకి పోతున్నట్లు వెళ్ళి వరండాలో కుర్చీలో చతికిలబడ్డాడు. 'అమ్మయ్య!' అనుకుని ప్రక్కకు చూస్తే, సోఫాలో దీర్ఘ నిద్రలో ఉన్న నాలుగడుగుల కుక్కగారు కనపడ్డారు. ఎండ లోంచి వచ్చి మంటలో పడ్డట్టు ఫీల్ అయ్యాడు రమేష్. ఇంటాయన వచ్చేసరికి రక్త మాంసాలు కాదు గదా, అస్థిపంజరం కూడా మిగలదని నిశ్చయించుకున్నాడు.

ఘడియలు ఘంటలుగా గడుస్తున్నాయి. కుక్క గారు ఏ క్షణంలో మేల్కొని తనను నంజు కుంటుందో అన్న భయంతో రమేష్ ఊపిరి కూడా చిన్నగా పీల్చుకోసాగాడు.

రమేష్‌కు గతం గుర్తుకొచ్చింది.

పదేళ్ళ వయస్సులో చెఱువు గట్టున ఆడు కుంటుండగా, ఓ పిల్లాడిని నల్లని గజ్జి కుక్క మీదపడి కరిచింది. అంతే- వారం తిరిగేలోగా, ఆ పిల్లాడు కుక్కలా అరవడం, మొరగడం - ఆ తరువాత 'హరీ' అన్నాడు.

అదిగో అప్పట్నుంచీ రమేష్‌కు కుక్క సంతతి అంటే భయం!

"హలో! ఏం కావాలండీ?" అన్న పిలుపు విని రమేష్ లేచేంతలో- కుక్కగారే ముందు గొంతింది.

ఆ గొంతటం తన మీదకో- గుడ్ ఈవెనింగ్ వైపో నిర్ధారణ అయ్యాక రమేష్- "ఇల్లండీ- ఇల్లు కావాలీ" అన్నాడు.

ఎదురుగా రోడ్డు రోలరంత మనిషి నిక్కరూ, టీ షర్టులో మొహానికి అరచేతికి సరిపడ్డా మీసాలూ, నున్నగా కడిగిన స్టీలు గిన్నెలా బట్టతల, కోడి



గుడ్లంత మిడిగుడ్లతో నిలబడ్డాడు.

"మీ పేరు!"

"రమేష్ అండీ!"

"నా పేరు చి. చి. కె. కయ్యి- గ్లాడ్ టు మీట్ యు" అని రమేష్ చేతిని పట్టుకు ఊపేసి, బైరు లాంటి చేత్తో బుజం తట్టి "కూర్చోండి" అన్నాడు చి. చి. కె. కయ్యి.

రమేష్ కూర్చున్నాడు.

"మీరేం త్రాగుతారు?"

"సిగరెట్!"

కయ్యి గారు భూకంపం వచ్చి ఆరంతస్తుల మేడ కూలి పడ్డట్టు నవ్వారు. నవ్వి, "బలే జోక్" అని మెచ్చుకున్నారు.

"మీరేం త్రాగుతారంటే - సిగరెట్ కాదోయ్, చిన్నోడా! కాఫీ, టీ, జిన్, బీర్, విస్కీ... ఇలంటివి!"

"నేను శాకాహారినండీ!"

మళ్ళీ భూకంపం, ఆరంతస్తుల మేడ కూలింది. "సరే! అరేయ్ బిహారీ! బన్- జామ్; టీ పట్రారా!" అని కేకేసి కయ్యి గారు, "బాగుంది... నీ కర్జంట్‌గా ఇల్లెందుకు కావాలి" అనడిగారు.

"ఉండేందుకండీ!"

కయ్యిగారు నవ్వబోయి ఆశ్చర్యంగా కనుబొమ్మలు ఎగరేసి, "అబ్బా! ఉండేందుకు! ఆ తరువాత ఏం చేస్తావ్?" అనడిగారు.

రమేష్‌కు ఏం చెప్పాలో తోచలేదు.

గతంలో మిలట్రీలో చేరేందుకు వెళ్ళినప్పుడు, ఇలాగే అవాక్కయినాడు.

మిలట్రీ కమాండరు ఓ చేత్తో తేలుకొండిలా ఉన్న మీసాన్ని త్రిప్పుతూ, మరో చేత్తో టీ త్రాగుతూ- "మై డియర్ యంగ్ బాయ్! నువ్వు పరాగ్గా ఉన్నప్పుడు శత్రువులు వస్తే ఏం చేస్తావ్?" అనడిగాడు.

రమేష్‌కు ఎంత ఆలోచించినా జవాబు దొరకలేదు. దిక్కులు చూశాడు.

మిలట్రీ కమాండరు- "బెస్ట్ ఆఫ్ లక్" అని పంపేశాడు.

"ఇల్లు ఉండేందుకు. ఆ తరువాత ఏం చేస్తావంటే- ఏం చెప్పాలి?" రమేష్ తలొంచుకున్నాడు.

కయ్యి గారు రమేష్ బిడియానికి సంతోషపడి, కుర్రాడు సాపు చేసిన టేకు కొయ్యలా, ఆయిల్‌తో పాలిష్ చేసిన స్టెన్‌గన్‌లా ఉన్నాడనుకుని, ఎడం చేత్తో మీసాలు దువ్వుకుని, "నీ పేరు రమేష్! మీ దే వూరు?" అనడిగాడు.

రమేష్‌కు ధైర్యం వచ్చింది. వంగిన నడుం బిగుసుకుంది. "మాది నర్సాపురం. టైలర్ హైస్కూలులో యస్సెల్సీ, పి. ఆర్. కాలేజీలో బియ్యే, ఆంధ్రా యూనివర్సిటీలో యం. కాం. ఓ సంవత్సరం చదివాను. నాకో బామ్మ, ఒక నాన్న, ఒక అమ్మ ఉన్నారు. నేను పుట్టిన రోజునే పొట్టి శ్రీరాములు పోయాడు. జీతం ఆరొందలు. డి. ఎ. మూడొందలు. ఇంటి అద్దె అలవెన్సు ..." ఆగి కయ్యి గారి వేంపు చూసి గతుక్కుమన్నాడు.

కయ్యిగారు బుంగమూతి పెట్టి, మీసాల మాటున ముసి ముసిగా నవ్వుకుంటున్నారు. ఆ పైన భళ్ళున పైకే నవ్వేసి, "యూ సిల్లీ ఫెలో" అన్నారు.

రమేష్ నడుం బాణాకర్రలా వంగిపోయింది. ఇంతకూ ఇల్లు ఇస్తాడా? లేదు పొమ్మంటాడా అన్న అనుమానం అల్సేషియన్ కుక్కంత అయింది.

బిహారీ అన్న వంటవాడు ట్రేలో బ్రెడ్ ముక్కలూ, చిన్న కప్పులో జామ్, నాలుగు కత్తులూ, ఫోర్కులూ తెచ్చి బల్లమీ దెట్టాడు.

'కమాన్' అని కయ్యిగారు అనటం ఆలస్యం కుక్కగారు. ఆరంగుళాల నాలుక చాపి వచ్చి టీపాయ్ దగ్గర నిల్చుంది. రమేష్ కళ్ళలోకి చూస్తూ.

"తీసుకో" అన్నాడు కయ్యిగారు.

ఆ హుకుం కుక్కగారికో, తనకో తెలియక కతికితే అతకదన్న సామెత గుర్తొచ్చి, "నే వెళ్ళి భోజనం చెయ్యాలండీ!" అన్నాడు రమేష్.

"తిందువుగాని, శాకాహారీ! ముందివి తిను" అని కయ్యిగారు ప్లేటు అందించారు.

ఆజ్ఞ శిరసావహించాడు రమేష్.

"నీకు పెళ్ళయిందా?"

అయిందంటే ఇస్తాడో, ఇవ్వడో ఇల్లు. వెనకటికో బామ్మగారు, 'మేం బ్రాహ్మలకు గదు లివ్వం. నాయినా, అంతా చాదస్తం. ముట్టని, అంటని ప్రాణం తీస్తారు. పైగా పెళ్ళయిందంటివి. మీ ఆవిడ బయటజేరితే వంటింటోంచే తప్ప బయట కొచ్చే దారి లేదు' అని ఇల్లు ఇవ్వనంది.

యద్దనపూడి సులోచనారాణి
1985 సూపర్‌హిట్ నవల!
జలపాతం జలపాతం జలపాతం
జలపాతం జలపాతం
జలపాతం జలపాతం
ఈ నెలే విడుదల!
వెల: రూ. 25/-
వెల రూ.25/- అన్ని పుస్తకాల షాపులలోను దొరుకుతాయి. లేదా రూ.2/- తగ్గించి M.O. చేయండి ఆ రూ.2కు V.P.P పంపుతాం.
క్వాలిటీ పబ్లిషర్స్
రామమందిరం వీధి, విజయవాడ-520002
SILPA

అందుకని మరో చోట పెళ్ళి కాలేదని చెబితే, ఇంటి ఆసామి, 'చెరకుగడలా ఎదిగావు. పెళ్ళి చేసుకోకపోవటం ఏం తీపరం. ఎవరి కొంపలు ముంచాలని ఇలా బజారున పడ్డావ్. తక్షణం పెళ్ళి చేసుకుని, మూ ట్టిముల్లె సర్దుకుని, ఇంట్లో రెండు గదు లిస్తాను' అని వీధిలోంచే ఉద్వాసన చెప్పాడు.

అందుకని, 'పెళ్ళి అయిందా?' అంటే అయిందని-కాలేదని చెప్పడం ఇష్టంలేక, "పెళ్ళండీ... నా కాండీ!" అని సిగ్గుతో తలొంచుకున్నాడు.

కయ్యిగారు మూతితో పాటు మీసాలూ తుడుచుకుని, "చూడవోయ్! బ్రహ్మచారులకు మాత్రమే ఇల్లిస్తాం!" అనన్నాడు.

వెన్నుపూసకు రోకలిబండ కట్టుకున్న వాడిలా రమేష్ నిటారుగా కూర్చుని, "నా క్కాలేదండీ. ప్రామిస్. మీ కుక్కమీ దొట్టు!" అని హుషారుగా అని, కుక్కగారిమీద చెయ్యేసి, గబుక్కున చెయ్యి కరెంట్ షాక్ తగిలినవాడిలా లాగేసుకుని, "కాలేదండి. కుక్కండీ...నిజమండీ" అన్నాడు.

కయ్యిగారు కయ్ అన్నారు. "మై డియర్ బాయ్! అదీ కుక్క గాదు. అండర్‌స్టాండ్? నా ఫ్రెండ్. ఓసారి నేను కాలుజారి బాత్రూంలో పడితే పరిగెత్తికెళ్ళి డాక్టరుని పిల్చుకొచ్చింది. అఫ్‌కోర్స్ వెటరినరీ డాక్టరునే అనుకో! తెలివిగలది. ఇప్పటికీ అంతే. నా యోగక్షేమాలు అదే చూస్తుంది. నైట్ వాచ్‌మన్ అది ఈ ఇంటికి. అమేజాన్ అడవుల్లో దొరికింది నా కది. తెల్సిందా. దాన్ని కుక్కనకు 'చుమ్రేబియా' అను. అంటే స్నేహితుడా అని అర్థం- కికుచికూ భాషలో. అనూ!"

"చుమ్రేభియా!" అన్నాడు రమేష్.

అంతే కుక్కగారు అమాంతం ముందు కాళ్ళెత్తి రమేష్ భుజాలమీ దెట్టి, మూతి నాకింది.

"అమ్మ నాయనమ్మోయ్" అని కేకేసి పడిపోయాడు రమేష్.

మళ్ళీ స్పృహ వచ్చేసరికి మంచంమీ దున్నాడు. ప్రక్కన డాక్టరు, ఆయన ప్రక్కన కయ్యిగారు; మరో ప్రక్కన అందాల భరిణే, ఆమె కుక్కలూ... అందరు తనవేపు ఆత్రుతగా చూడటం గమనించాడు.

కళ్ళు మూసుకుంటే, చుమ్రేబియా. తెరిస్తే శునక సంతతి!

"మీకు కుక్కలంటే...భయమా?"

"అవునండీ!"

"ఎందుకనీ ?" కయ్యిగారు మిలట్రీవాడిలా అడిగారు.

"కుక్క కరిస్తే పిచ్చెక్కుతుందండీ!"

"ఎవరన్నారు?నాన్సెన్స్. ఇవి కుక్కలు కావు. ఫ్రెండ్స్. స్నేహితులు తెలిసిందా?" కుక్కలా ఘీంకరించారు కయ్యిగారు.

"తెలుసనండీ. కానీ, మీ కుక్కలకు నేను స్నేహితుడునో, కాదో తెలియదు గదండీ!" అన్నాడు రమేష్- ఇల్లొద్దూ, పాడొద్దూ, ఈ కుక్కల పొరుగు అసలే వద్దు అన్న స్థిర నిశ్చయంతో.

'డామిట్!' కుక్కని ప్రేమించటం చేతగానివాడు కుక్కకన్నా హీనుడు. నీచుడు. ఆల్‌రైట్. ఇదే పందెం. కుక్కలంటే నీకు అసహ్యం. ఎలర్జీ. భయంగదా. కాసుకో... ఆర్నెల్లలో నీకు కుక్కల మీద విపరీతమైన అభిమానం కలుగచేస్తాను. నే నోడిపోతె, కుక్కలతో సహా ఊరొదిలి వెడతాను, నా కూతుర్ని నీకిచ్చి పెళ్ళి చేసి! నువ్వే గెలిచావ్పూ... నా కూతుర్ని నీ కిచ్చివేస్తా కుక్కలతో సహా!" అని కయ్యిగారు ప్రతిజ్ఞ చేశారు. తన మాట నిసద భీషణశంకమే! అన్నట్లు.

"అది గాదండీ" అని నూతిలో పడ్డ కుక్కలా ఏదో చెప్పబోయాడు రమేష్.

కాట్లకుక్కలా కయ్ మన్నారు కయ్యిగారు. "మళ్ళీ మాట్లాడి నా మాట కెదురు చెప్పావంటే, ఇంట్లో ఉన్న పెద్దెనిమిది కుక్కలూ లైనుగా వచ్చి కరిచిపోతాయి. ఆ తర్వాత రాబీస్ వ్యాధొచ్చి, అడ్రసు లేకుండా బోతావు" అని శపించారు.

మూలిగే కుక్కమీద తాటికాయ పడ్డట్లు రమేష్ 'హతోస్మి' అనుకుని, అటేడు తరాలకు, ఇటేడు తరాలకు టాటా చెప్పేశాడు- తన బ్రతుకు కుక్కలు చింపిన విస్తరి అవబోతున్నందుకు దిగులుగా.

## 2

రమేష్‌కు కుక్కపాట్లు ప్రారంభమైనాయి.

సాయంత్రం ఆఫీసు వదిలే వేళకు కయ్యిగారు కారు, కారులో కుక్కలతో ప్రత్యక్షమైనారు నవ్వుతూ.

రమేష్ పారిపోదామని చూశాడు.

'రావోయ్. నేను మిలట్రీలో పని చేసి రిటైరయ్యాను. అపజయం ఎరుగను. నీ అంతు తేల్చేదాకా వదలను' అన్నట్లు, చెయ్యట్టుకుని కార్లో కుదేసి ఇంకిటి పట్టుకుపొయ్యారు కయ్యిగారు.

ఓ ప్రక్క కయ్యిగారు పులిలాంటి మీసాలతో, మరో ప్రక్క నాలుగు అడుగుల చుమ్రేబియా! రమేష్‌కు యమదూతలతో ప్రయాణం చేస్తున్నట్లు ఉంది.

ఇంటి కెళ్ళాక, రమేష్ కోసమని ఓ గది ఖాళీ చేయించి అక్కడుండమని కయ్యిగారు ఉత్తర్వు జారీచేశారు. వాకిట్లో కాపలాకు కుక్కని కాపలా పెట్టారు.

కయ్యిగారి ఏకైక కూతురు జాన్‌మేరీ తాయారును రమేష్ నడుపాయాలు చూసేందుకు పురమాయించి— "మిష్టర్ రమేష్! నా ఆస్తికి, కుక్కలకు జాన్‌మేరీ తాయారు వారసురాలు. అమ్మాయి మెట్రిక్ పరీక్షలకు తయారవుతోంది. నువ్వు ఎమ్.కామ్. ఓ సంవత్సరం చదివావు గదా! అమ్మాయికి చదువు చెప్పు. నీ భోజన, వసతి ఫ్రీ" అన్నారు కయ్యిగారు.

"సార్! మీ పేరు ఏమిటి? కయ్యిగారంటే ఏమిటి? నా సందేహనివృత్తి చేయండి" అని రమేష్ ప్రార్థించాడు సస్పెన్సు భరించలేక.

కయ్యిగారు చిదంబర స్వాములార్లా నవ్వారు. మీసాలు మెలేసుకుని, జానెడు చుట్టకు నిప్పెట్టి, "నా పేరు చింతాద్రి చినకనకయ్య. చదువబ్బక, మా నాయన కొట్టే దెబ్బలు, చెప్పే సంస్కృతం ముక్కలు ఇముడ్చుకోలేక, ఓరోజు రైలెక్కి ఉడాయించాను. రైల్లో గిల్లెట్ దొరగారు, ఆయన ప్రేయసి బ్లూ డైమండ్ అనబడే కుక్కగారు పరిచయం అయ్యారు. ఆయన నన్ను వెంట తీసుకువెళ్ళి తన బంగళాలో కుక్క పరిచర్యలకు నియమించారు.

కుక్కకన్నా విశ్వాసంగా గిల్లెట్ దొరగార్ని, ఆయన బ్లూ డైమండ్‌కు సేవ చేశా.

ఆయన- 'యంగ్‌మాన్!' అని వరం కోరుకో అన్నారు ఇంగ్లాండ్ పోతూ.

'ఉద్యోగం' అన్నా.

'మిస్టర్ కయ్యి (చింతాద్రి చినకనకయ్య)! ఇంగాండ్ రా!' అన్నారు.

'రాను' అన్నా.

'వై?' అన్నారు.


'మదరులాండు. మా ఫాదరు, బొబ్బర్లంక, కొబ్బరి ట్రీసు' అన్నా.

'డర్టీఫెలో-వెళ్ళి ఆర్మీలో చేరు' అని మిలటరీ మెసులో పారేశారు.

అలా మిలట్రీలో దూరా. తిన్నంత తిండి. వళ్ళు పెరిగిరేది. పెళ్ళి చేసుకున్నా. ఇదిగో జాన్‌మేరీ తాయారు పుట్టింది."

"మరి మీ ఆవిడో?"

"మా ఆవిడ తండ్రి బెంగాలీ క్రిష్టియను. తల్లి కేరళ ముస్లిము. అందుకని మాఅమ్మాయి జాన్‌మేరీ అయింది. నేను కోనసీమ బ్రాహ్మడిని కనుక తాయారు కలిపేను. నాకు కులమతాలు లేవు. కనుక మిస్టర్ రమేష్! మా అమ్మాయిని ప్రేమించు. కుక్కలను ప్రేమించు. నా అల్లుడివికా!" అన్నారు కయ్యిగారు.



రమేష్ సామాను తెప్పించారు గదినుంచి.

బిహారీ వంట అద్భుతంగా చేసేవాడు- చేసిన వంట శాకాహారమో, మాంసాహారమో తెలియకుండా. హోటలు తిండితో ముఖం వాచిన రమేష్ గుట్టుచప్పుడు కాకుండా తినేవాడు.

తాయారు తండ్రిపోలిక.

కుక్కలతో కాలక్షేపం జాస్తి. చదువంటే ఆసక్తి నాస్తి.

పోనీ పై జుట్టు, ఫ్రాక్‌లో చూట్టానికి ఇంగ్లీష్ బొమ్మలా ఉంటుంది జాన్‌మేరీ తాయారు.

రమేష్‌కు మాపారొచ్చింది. తెగువ కలిగింది. ధైర్యే సాహసే లక్ష్మీ అన్న సామెత గుర్తొచ్చింది.

ఆస్తి, కొబ్బరి ముక్కలాంటి పిల్ల...మంచి అవకాశం। 'దొరుకునా ఇటువంటి సేవ' అనుకుని ఓ రోజు పెళ్ళానికి ఉత్తరం వ్రాశాడు.

"వెంకట రమణమ్మా!

క్షేమము. విశేషాలేం లేవు. కాలికి చెప్పులేసుకుని తిరిగినా ఇక్కడ అద్దెకు ఇళ్ళు దొరకడం లేదు. దొరికినా గదికే వంద అంటున్నారు. గాలికి, వెలుతురుకు, బాత్‌రూమ్‌కు, పంపునీళ్లకు వేరే ఇచ్చుకోవాలి. కనుక కొన్నాళ్ళు అత్తమామల ఇంటనే ఉండాల్సింది. వంట నేర్చుకో, కుట్లు అల్లికలు సరేసరి. సంక్రాంతికి ముగ్గు లెయ్యి. నోములు పూర్తి చేసుకో!

నా ఆరోగ్యం ఫరవాలేదు. నీ ఆరోగ్యం జాగ్రత్త. ఇంతే. ఉంటా."

## 3

రమేష్ బజారు కెళ్ళి 'కుక్కలు-జాతులు-పెంపకం' అన్న విషయంపై దొరికినన్ని పుస్తకాలు కొన్నాడు. చదివాడు.

అంతేకాదు, డ్రెస్ మార్చాడు. తీరు మార్చాడు. చొరవ నేర్చుకున్నాడు.

తాయారుతో కలిసి ప్రొద్దున్నే మేడమీద ఎక్సర్‌సైజులు మొదలెట్టాడు. చేతులు ముట్టుకోడం, బుగ్గలు నిమరడం, నవ్వడం సాగించాడు. ఆఫీసు నుంచి రాగానే తాయారుతో తోటలో షికార్లు చేసేవాడు.

డైనింగ్ టేబుల్ దగ్గర, టేబుల్ క్రిందనుంచి కాళ్ళతో సరసాలు ఆరంభించాడు.

కయ్యిగారు రమేష్ వాలకం, కుక్కలపై చూపుతున్న ప్రేమచూసి సంతోషించి, "మిస్టర్, రమేష్! మీ తండ్రి అడ్రస్ ఇవ్వు" అనడిగాడు.

రమేష్ ఇచ్చాడు.

కయ్యిగారు ఓ రోజు మేడమీద కుర్చీ వేయించి తాయారునూ, రమేష్‌నూ కూర్చోబెట్టి, "మీ ఇద్దరూ ఊఁ అంటే పెళ్ళి జరిపించేస్తాను" అని ప్రకటించాడు.

తాయారు మొహం నియోన్ లైటులా వెలిగింది.

రమేష్‌కు గొంతులో కొబ్బరికాయ ఇరుక్కుంది. "పెళ్ళా?" అన్నాడు.

"అవునోయ్, పెళ్ళే!" అని కయ్యిగారు కళ్ళు ఎర్రచేసి, మీసాలు మెలి దిప్పారు.

"మీ నాయనగారికి ఉత్తరం రాశా. అంతగా అయితే మంచిరోజు చూసి నేనే వెళ్ళొస్తాను" అన్నారు కయ్యిగారు.

"ఇప్పుడేం తొందర! ఏం, తాయారూ?"

తాయారు సమాధానం చెప్పలేదు. బుంగమూతి పెట్టి ఆ తర్వాత నవ్వి, ఆ తర్వాత చంకలో ఓ టామీని ఎత్తుకుని చెంగు చెంగున గెంతుతూ మేడ దిగిపోయింది.

"తొంద రంటావేమిటి, అల్లుడూ! మీ ఇద్దరీ మనసులు కలిశాయి. మీరు చాటుగా వాటేసుకోవడం, ముట్టుకోవడం, కిచకిచలాడటం, ఒకర్ని చూడకుండా ఒకరు ఉండలేకపోవడం...ఇవన్నీ చూశా! ఆలస్యం చేస్తే బారసాల, పెళ్ళి చెయ్యాల్సి వస్తే! పైగా మీ పెళ్ళి అయితే నాకు నిశ్చింత. ఏ కాశీకో పోయి అక్కడే ఉండిపోతా!"

ఆ రాత్రి రమేష్ అన్నం తినలేదు. దిగులుగా దూలాలు, అక్కడున్న బల్లిని చూస్తూ 'ఏదీ గతి నాకూ?' అని పాటలు పాడాడు.

తండ్రి గుర్తుకొచ్చాడు. అయన పేరు నరసింహం. ఇత్తడి చెంబులా బట్టతల, ఎర్రగా కందగడ్డలా మొహం, పెళ్ళాంతో రహస్యం మాట్లాడినా నాలుగిళ్ళ కవతల వసపిల్లలు ఝడుసుకునేంత గొంతు గుర్తుకొచ్చాయి. నిజంగా కయ్యిగారి ఉత్తరం ఆయన చేతబడితే, "అంట్ల వెధవా! నీ జాడీ మొహానికి ఒక్కతే చాలదూ! పెళ్లయి, పిల్ల తండ్రి కావలసిన నీకు మళ్ళీ ఇంకొకతే కావాలా, జడ్డీపీనుగా! వెధవ్వేషాలు వేస్తే కాలో, చెయ్యో విరిచేసి చిప్ప చేతికిచ్చి బస్సుస్టాండులోనో, పడవల రేవు దగ్గరో, గుడిముందటో కూలసి అడుక్కోమంటాను. అదీగాక గవిడి గెదేలా ఉన్న నీకు మరో పిల్ల ఇస్తామన్న కుంక ఎవడు. దాని కులమేమిటి? గోత్ర మేమిటి! పద నే వస్తా?" అని దుడ్డుకర్రో, పందుల్ని పొడిచే బరిశో తీసుకురాగలడు.

అప్పుడు అటు కయ్యిగారు ఓ మెషిన్ గన్, ఇటు నరసింహం ఓ బరిసె ...

ఆ పరిస్థితి ఊహించుకుని రమేష్ డబుల్ టైఫాయిడ్, డి సెంట్రీ వచ్చినవాడిలా వణికిపోయాడు.

"డియర్! జొరమా.. ఫుడ్ తినలేదేం?" అని తాయారొచ్చి మంచంమీద కూర్చుని పొట్టమీద చెయ్యేసి, "వల్లు బాగునే ఉంది. ఫుడ్ ఎందుకు మెయ్యలేదూ?" అని అడిగింది.

"హెడేక్...నువ్వెళ్ళూ!" అని కసురుకుని ఆమె వెళ్ళాక మళ్ళీ కయ్యిగాని, కుక్కగాని రాకుండా తలుపేసుకుని నిద్రపోయాడు.

నిద్రలో భార్య వెంకటరమణమ్మ గుర్తుకొచ్చింది.

మర్రోజుకు రమేష్ దిగులుగా, నీరసంగా కనిపించాడు కయ్యిగారికి.

"ఆఫీసు కెళ్ళొద్దు. రెస్టుగా ఉండు!" అని గదమాయించాడు.

"కాదు. పోవాల్సిందే!" అన్నాడు రమేష్.

"వంట్లో బాగోలేదని నీమొహం చెబుతుంటే ఆఫీసు కెలా వెడతావ్?"

"నడిచి!"

"వెళ్ళు, చూద్దాం!"

రమేష్ రెండడుగులు వేశాడు.

ఎదురుగా చుమ్రేదియా నాలుక చాచుకుని, యజమాని ఆజ్ఞకోసం ఎదురుచూస్తు ఊఁ అంటే ఎగిరి ఓ గుక్కలో రక్తం జుర్రేసి మాంసం తినేసి బ్రేవ్ మనేలా ఉంది.

"నా మాట విను. హాయిగా రెస్టు తీసుకో! అమయ్, అల్లుడు గారికి సేవ చేయి!"

తాయారు నవ్వి, "రాండ్రి" అని రమేష్‌ను మేడమీదకు తీసుకెళ్ళింది.

మధ్యాహ్నం తాయారుతో కలిసి రమేష్ సినిమా కెళ్ళాడు.

అప్పుడు కయ్యిగారు బయట తోటలో కూర్చుని ఉండగా, ఇంటిముందు రిక్షా ఆగింది. అందులోంచి ఓ ఆడమనిషి దిగింది.

"ఎవరు కావాలమ్మా!" కయ్యిగారు అడిగారు.

చెప్పింది.

"నువ్వే మవుతావ్?"


చెప్పింది. "ఆయన లేరా?"

"దొంగ వెధవ! సినిమాకెళ్ళాడు. రానీ, వాణ్ణి నీ కళ్ళముందే కుక్కలచేత కరిపించేస్తాను" అన్నాడు కయ్యిగారు వళ్ళు కందులు నమిలినట్లు నములుతూ.

"ఏం చేశారూ?"

కయ్యిగారు ఏడ్చారు. జరిగింది చెప్పారు.

వెంకట రమణమ్మకు అంతా కలలా ఉంది. "అందుకే, బాబాయిగారూ, ఇక్కడ ఇళ్ళు దొరకడం లేదూ, రావద్దని రాశారు?"



కయ్యిగారు ఓ గంట ఆసులో గొట్టంలా తిరిగారు. బుర్ర గోక్కున్నారు. మీసాలు మెలేసుకున్నారు. తల అడ్డంగా, నిలువుగా తిప్పారు.

రమణమ్మ అయన్నే చూస్తూ ఉండిపోయింది.

"లాభం లేదు. ఈ పెళ్ళి జరగాల్సిందే!" అన్నాడు కయ్యిగారు పెద్దగా.

"మరి నా బ్రతుకో?"

"నీ చావు నువ్వు చావు. నాకేం?"

"బాబాయిగారూ!"

కయ్యిగారు కుదేలైనారు...వెంకటరమణమ్మ కళ్ళలో నీళ్ళు చూసి, బాబాయి అన్న పిలుపు వినీ!

ఆలోచించి ఆలోచించి, "అయితే, వెంకటరమణమ్మా! నే చెప్పినట్లు చేస్తావా?" అన్నారు.

"చేస్తానండి!" చేతిలో చేయి వేయించుకుని చేయాల్సిన పని చెప్పారు.

వెంకటరమణమ్మ ఇంట్లో కెళ్ళి స్నానం చేసి, జడ వేసుకుని, పూలు పెట్టుకుని గదిలో కూర్చుంది.

రమేష్, తాయారు సినిమానుంచి వచ్చారు. కయ్యిగారు మాట్లాడలేదు.

రమేష్ స్నానం చేసి, సిగరెట్ ముట్టించుకుని ఈలవేస్తూ వరండాలో కొచ్చి గదివైపు చూస్తే కయ్యిగారు గదిలో లైటూ, ఫానూ తిరుగుతునయి. కయ్యిగారు బయటే ఉన్నారు. ఏమిటి చెప్మా? అన్న ప్రశ్న ఉదయించింది. కానీ, కయ్యిగారు కొలిమిలోంచి తీసిన ఇనుపముక్కలా ఉండడంతో రమేష్ మనకెందుకులే అని ఊరుకున్నాడు.

రాత్రి భోజనాల దగ్గర కయ్యి, తాయారూ, రమేష్ కూర్చునుండగా కయ్యిగారు- "ఓ ముఖ్య ప్రకటన!" అన్నారు.

"చెప్పండి" అన్నాడు రమేష్.

"నాకు యాభై ఏళ్ళు; ఇన్నాళ్ళూ భార్య లేకపోయినా మాఅమ్మాయిని చూసుకుని బ్రతుకుతున్నా. కానీ, రేపు అమ్మాయి పెళ్ళయితే ఒంటరితనం భరించడం ఎలా?"

"కాశీ వెడదామంటిరే!"

"ఆ ప్లాను మార్చుకున్నా. పోతే, మా తాయారు పెళ్ళికి పీటలమీద ఎవరు కూర్చుంటారు? ఉన్న ఒక్క కూతురు పెళ్ళి ఏ జగ్గాయి, తుమ్మాయినో కూర్చో పెట్టి చేయించడం నా కిష్టం లేదు. అందుకని ..."

"ఊఁ అందుకని ..."

"నే పెళ్ళి చేసుకుంటున్నాను!"

"ఆఁ!"

"ఆఁ అని అలా నోరు తెరవకు. నోట్లోకి ఈగో, దోమో పోగలదు."

"మీ కెవరిస్తారు పిల్లని!"

"ఎందుకివ్వరు? అయినా అదంతా నీ కనవసరం. నే పిల్లను చూశా. బిహారీ, మాఆవిడను కేకెయ్యి!" అని ఆజ్ఞాపించాడు.

రమేష్‌కు అంతా అయోమయంగా ఉంది. "అమ్మ ముసలిపీనుగ! తొందరపడి తాయారును చేసుకుంటే ఆస్తి రాకపోగా, కుక్కలు మాత్రం దక్కి కుక్క బ్రతుకయ్యేది" అనుకున్నాడు.

వెంకట రమణమ్మను చూసి రమేష్ నెత్తిన పాముపడ్డ వాడిలా బిగుసుకుపోయాడు. "నువ్వు . . ." ఆ తర్వాత గొంతులో కొబ్బరిపీచు ఇరుక్కున్నట్లు ఆగిపోయాడు.

"ఈవిడ నీకు తెలుసా?"

"నాకా?"

"ఈవిడ పేరు రమణి. మై డియర్! దా కూర్చో!" రమణమ్మ కయ్యి ప్రక్కన కూర్చుంది. అయన్ను ఆనుకుని.

రమేష్ వంటిమీద ఎర్రచీమలు ప్రాకినాయి.

తాయారు రమణమ్మను చూసి నవ్వింది. "మీరు పిన్ని అవుతారా!" అంది.

"అవును!" అంది రమణమ్మ, కయ్యిగారికి ప్లేట్లో చట్నీ వేస్తూ.

రమేష్‌కు అన్నం సయించడంలా! పైగా రమణమ్మ-దీని దుంపతెగ, కయ్యిగారే అసలు మొగుడైనట్లు ఆయనతో చనువుగా ఉండడంతో మరీ అసహనం, కోపం, చిరాకు కలిగాయి. అంతేగాక రమణమ్మ తన ఉనికి గుర్తించనట్లు, అసలు తనెవరో కూడా తెలియనట్లు ప్రవర్తించడంతో మరీ పిచ్చోడయ్యాడు.

ఆ రాత్రి రమణమ్మతో మాట్లాడాలని చాలాసార్లు యత్నించాడు రమేష్.

కయ్యిగారు పట్టెమంచంమీద దున్నపోతులా పడుకునుంటే రమణమ్మ ప్రక్కనే కుర్చీమీద కూర్చుని తమలపాకుల ఈనెలు తీస్తూ ఓ సారి.

కయ్యిగారు చుట్ట గొట్టం పొగలా ఊదుతూ ఉంటే, రమణమ్మ ప్రక్కనే పడక్కుర్చీలో పడుకుని ఓ నవల చదువుతూ ఉంది.

రమేష్ తలుపుచాటు చేసుకుని సైగలు, ఇశ్, ఇశ్ అని శబ్దాలు చేశాడు.

"రమణీ డియర్! రాత్రిపూట ఉడతలు అరుస్తున్నాయా?" అన్నారు కయ్యిగారు.

"అవునండీ!" అంది రమణమ్మ రమేష్ అవస్థ చూసి.

ఆ రాత్రి రమేష్ జుట్టు పీక్కున్నాడు. నాలుక, పెదాలు కొరుక్కున్నాడు. ఒళ్ళంతా బరుక్కున్నాడు.

పైగా కయ్యిగారి గదిలోంచి ఆయన, రమణి పడీపడీ నవ్వడం వినపడడంతో పుండుమీద పండు మిరపకాయ కారం రాసినట్లు రమేష్ గంతులేశాడు.

లేచి వెళ్ళి రమణమ్మ జుట్టు పట్టుకుని ఫెడేల్, ఫెడేల్‌మని కొడదామనుకుని కయ్యిగారు గుర్తుకొచ్చి ఆగిపోయాడు.

తెల్లవారింది.

రమణమ్మ ఒంటరిగా దొరకలేదు రమేష్‌కు.

రమేష్ పిచ్చివాలకం చూసి కయ్యిగారు, "రాత్రి ఏంటోయ్ ... నీ గదిలోంచి శబ్దాలు వచ్చయి?" అని అడిగి, "బాగా నిద్దర పట్టిందటోయ్ రాత్రి!" అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

పొద్దునే కయ్యిగారు స్నానం చేసి పట్టుబట్టలు చుట్టుకుని, "అల్లుడూ! ఈవాళ ఆఫీసుకు వెళ్ళకు" అన్నారు.

"వెడతా!" కసిగా అన్నాడు రమేష్.

"నీ ఇష్టం. నేనూ, రమణీ డియర్ రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేసుకుంటున్నాము. నువ్వు రావా?"

"పెళ్ళా?" రమేష్ రంకె వేశాడు.

అవును. రాత్రి చెప్పాగా!"

రమేష్‌కు కోపం బుసిన వచ్చింది. "ఈ పెళ్ళే జరిగితే-నిన్ను నల్చుకు తినేస్తా!"

"అబ్బా!"

"పాపం, ఆయనగారికి మతి స్థిమితం లేదల్లే ఉంది" అంది రమణి.

"ఓ సేప్, ఏం కూశావ్!" రమేష్ పిచ్చికుక్కలా ఆమెమీదకు వెళ్ళాడు.

కయ్యిగారు అడ్డంవచ్చి, "ఆమె ఎవరనుకున్నవ్ ... జాగ్రత్త" అన్నారు పులిలా!

"అది నా పెళ్ళాం!"

కయ్యిగారు నవ్వారు బాంబులు పేలినట్లు.

"నవ్వకురా, కనకయ్యి!" అన్నాడు రమేష్ కసిగా.

కయ్యిగారు నవ్వడం ఆపి, "పుండాకోర్! రమణమ్మ నీ పెళ్ళామా?" అనడిగారు, కాలరు పుచ్చుకుని.

"అవును."

"తాట వలిచేస్తాఁ! దగుల్బాజీ! అబద్ధాలాడి నా కూతురు గొంతు కోద్దామనుకున్నావా? సమయానికి రమణమ్మ రాబట్టి నీ గుట్టు తెలిసింది. కొనసిమ వెదవ్వి గదా, కూతుర్నిద్దామని ఆశపడ నమ్మించి నా గొంతు కోద్దామని చూశావ్। నిన్ను . . ."


"మీరే శిక్ష వేసినా సరే భరిస్తా" అన్నాడు రమేష్, కళ్ళ నీళ్ళతో కాళ్ళమీద పడి.

క్షణం ఆలోచించి కయ్యిగారు, "అయితే విను. గుండు గీయించుకో! నామాలు పెట్టుకో! నిక్కరు తొడుక్కుని ఏడురోజులు ఆఫీసుకు వెళ్ళు." అనరు.

రమేష్ గుండు గీయించుకుని, నామాలు పెట్టుకుని, నిక్కరు తొడుక్కుని, కుక్కలా ఆఫీసుకు వెడుతూ ..... కుక్కచావు అనుభవించాడు ఓ వారం.

నీతి: పెళ్ళయి, మళ్ళీ వేరే పిల్లపై వ్యామోహపడిన వారి గతి కుక్క గతే! ★

అదీసంగతి




ఎడంచేతి సాయంతో ఇప్పుడు ఫైల్స్ త్వరగా డిస్పోజ్ చేసేస్తున్నా.